కథానిక

# పీతాంబరం

అవంతి

అది రోమను సామ్రాజ్యపు టౌన్నత్యదశ. చక్రవర్తి అరేలియన్, ప్రాచ్యదేశాధీశుల నోడించి, తన విజయోత్సవ సమయాలలో రోమునగర వీథులలో ప్రదర్శించిన గరువపుదినాలు అవి. అప్పటికింకా, క్రైస్తవమతపు తాకిడి, రోమను సామ్రాజ్యానికి తగలలేదు. కాని పర్షియాదేశపు చక్రవర్తి, బెహ్రాంఖాన్ మాత్రం, అరేలియన్‌కు పక్కలో బల్లెమైయున్నాడు. అరేలియన్‌కు ముందు గద్దెనెక్కిన వాలెరియన్ చక్రవర్తిని సజీవంగా బంధించి, చిత్రవధచేసి, అతని శరీరంలో గడ్డి కుక్కి, ఆ దిష్టిబొమ్మను రాజప్రాసాదపు మొగసాలవద్ద వేలాడ గట్టినవాడు యీ బెహ్రామే. అరేలియన్‌కూ - అతనికీ - ప్రస్తుతం వైరం లేకపోయినా, ఇరువురూ పాతపగలు మరచిపోనేలేదు.

అరేలియన్‌కు తన ఆధిక్యము వెలిబుచ్చి, అవమానితుని చెయ్యాలని సంకల్పం కలిగిం దొకనాడు బెహ్రాంఖాన్‌కు. శత్రుత్వం ప్రకటించకుండానే, యీపని నెరవేర్చడం ఎట్లాగో అతనికి తెలిసింది కాదు. అందుకని తన ఆస్థాన విద్వాంసుల్నీ మంత్రుల్నీ సమావేశపరచి సలహా అడిగేడు.

'పర్షియాదేశపు గౌరవం ఔన్నత పొందకుండానే, రోమను సామ్రాజ్యాన్ని గౌరవించాలి. అరేలియన్ చక్రవర్తి నవమాన పరచకుండగనే, న్యూనత నొందించాలి. ఇది ఏరీతిగా సంభవం?' అన్నాడు, సభ్యుల నుద్దేశించి.

వజీర్లు, సేనా నాయకులు, మత గురువులు నోరు మెదపలేదు. సభనంతా నిశ్శబ్దమావరించింది. కొంత సేపటికి, మార్కోబాద్ అనే ప్రసిద్ధవేదాంతి, విజ్ఞానవేత్త లేచి యిలా సమాధానం యిచ్చేడు:

'చక్రవర్తికి, నా అభివాదాలు. గతించిన దినాలలో పర్షియన్లు మూడు పనులలో ప్రసిద్ధులు. గుర్రపు స్వారి, విలువిద్య, సత్యవాక్పరిపాలన. నాగరికతా చిహ్నం కాదని మూడవది విసర్జించినా, మొదటి రెండింటిలో మన మిప్పటికీ ప్రసిద్ధులమే. అరేలియన్‌ను న్యూనత చెయ్యడానికి, అబద్ధం ఆడాలని, మీరు జంక నక్కరలేదు. అతని సామ్రాజ్యంలో దొరకనిదీ, మనకు లభ్యమైనదీ అయిన వస్తువు నతనికి బహుమతిగా పంపించాలి. అటువంటి వస్తువు మహారాణి నిత్యమూ ధరించే పట్టు పీతాంబరం. ఆ అమూల్య బహుమానాని కితడు సంతోషపడతాడు. కాని అది తన రాజ్యంలో లభ్యం కానందుకు సిగ్గుపడతాడుకూడా. ఈ సలహా, తమకు నచ్చుతుందని ఆశిస్తా.'

'నీ సలహా నాకు నచ్చింది. ఇందుకు బహుమానంగా, నిన్ను రాజ్యంనుండి బహిష్కరించి, నీ ప్రాణం రక్షిస్తాను. ఎందుచేతనంటే, ప్రియతమమైన తన పీతాంబరం, అరేలియన్‌కు బహూకరించమన్న సలహా నీదేనని తెలియగానే, రాణి, నీ తల కోరుతుంది. ఆవిడకు నేనేదీ తిరస్కరించలేను. నీవు త్వరితగతిని పలాయనం చిత్తగించటంమంచిది. అట్టి వస్త్రాన్ని తయారుచేసే విధానం, రంగు నీవు తీసికొనివచ్చినట్లయితే, నీకు మరల పర్షియాలో ఆవాసం దొరుకుతుంది' అని సమాధానం యిచ్చేడు బెహ్రామ్.

మార్కోబాద్, తన సర్వస్వాన్ని విసర్జించి, పలాయనం చిత్తగించేడు. రాణీగారి ఆజ్ఞప్రకారం అతని ఆస్తిపాస్తులన్నీ జప్తుచెయ్యబడ్డాయి. అమూల్యమైన ఆ వస్త్రాలు, హిందుదేశంలో తప్ప, మరెక్కడా తయారుకావని తెలుసు కనక, మార్కోబాద్ వొంటరిగా తూర్పుకు పయనిస్తున్నాడు. రాణీగారి పీతాంబరాన్నొక దంతపు పెట్టెలో పెట్టి, రాయబారవర్గం రోముకుతీసుకు బయల్దేరేరు.

అరేలియన్ సముఖంలో, రాయబారి, దంతపు పెట్టె తెరచి, పీతాంబరం బయటికి తీసి, బహూకరించేడు. దాని కాంతిముందర, చక్రవర్తి చీని చీనాంబరాలు వెలవెలపోయాయి. అరేలియన్‌కు, బెహ్రామ్ వ్రాసిన లేఖ యీవిధంగా వుంది:

'అరేలియన్ చక్రవర్తికి. బెహ్రామ్, ఉభయకుశలోపరి. పర్షియాలో దొరకే యీ పీతాంబరం స్వీకరించండి.'

అక్కడున్న ఒక యువక వేదాంతి, అరిచేడు.

'పర్షియాలోనా? అబద్ధం! అపురూప వస్తువుగా తప్ప, యిలాంటి పీతాంబరాలు, పర్షియాలో మచ్చుకుకూడా కనపడవు.'

ఈ మాటలకు పర్షియన్ రాయబారి నొచ్చుకుని ఏదో సమాధానం యివ్వబోతూండగా, అరేలియన్ వారించి, రాయబారవర్గాన్ని సత్కరించి పంపించేసేడు.

తరువాత, ఆ యువక వేదాంతిసోరియానస్‌ను పిలిపించేడు. ఆ పీతాంబరాలు, నిజంగా ఎక్కడ తయారుచేసేరో చెప్పమన్నాడు.

'హిందూ దేశంలో తప్ప, మరెక్కడా అవి తయారుకావు' అన్నాడు సోరియానస్.

'సరే, అయితే, నువ్వో, లేక బ్రహ్మో, ఎవరో ఒకరు యీ విషయంలో అబద్ధమాడుతున్నారు. బ్రహ్మ్ అబద్ధమాడితే, అతనిపై యుద్ధం ప్రకటించి, యీ అవమానం చెరుపుకోవలసిన బాధ్యత నాపైవుంది. అతను నిజమే చెప్పిన పక్షంలో, నాకులేని యీ వస్తువు నతని దగ్గరనుండి తీసుకోడానికి, యుద్ధం ప్రకటించడంకూడాధర్మమే. కాని, వెంటనే యుద్ధం ప్రకటించే స్థితిలోనేనులేను. ఈలోగా, నువ్వు హిందూదేశంవెళ్ళి స్వయంగా నిజం తెలుసుకురా. వట్టిచేతులతో తిరిగివస్తే, నీ తల తెగ్గోయిస్తాను. ఈలోగా నీ ఆస్తిపాస్తులు, నా అధికారులు అజమాయిషీ చేస్తూంటారు. నువ్వు వెంటనే బయలుదేరు' అని ఆజ్ఞ యిచ్చేడు, అరేలియన్.

ఆవిధంగా చక్రవర్తుల నిరంకుశపాలన ఫలితంగా, యిర్వురు ప్రతిభావంతులైన వేదాంతులూ పీతాంబరాన్వేషణార్థం భయంకర ప్రమాదాన్విత మైన దేశాలగుండా ప్రయాణంసాగిస్తున్నారు. సోరియానస్ బయల్దేరిన అయిదు నెలలకి, అరేలియన్ తన సైన్యాధికారులచే హత్య చెయ్యబడ్డాడు. అతని తరువాత గద్దె నెక్కిన టాసిటస్, ప్రోబస్, కారస్, కారినస్, అందరూకూడ కొద్దికాలంలోనే మృత్యు సాన్నిధ్యం చేరుకున్నారు. ఆ తరువాత, డయొక్లీషియన్ ఇరవై సంవత్సరాలు రాజ్యంచేసి, విరమించేడు. ఈ చక్రవర్తులందరి స్వభావాలూ విభిన్నమైనవి. కాని, పీతాంబరం విషయంలో మాత్రం అందరూ ఏకాభిప్రాయులే. ఎంతకాలానికీ, సోరియానస్ జాడ తెలియకపోయే సరికి, అతని సంగతి తెలుసుకోడానికి అనేకమంది పంపించబడ్డారు. వారందరూ, వింత వింత అనుభవాలు పొంది తమవిధి మరచేరు. కొంతమంది క్రూర మృగాల నోటపడ్డారు. కొందరు ఆకలి దప్పులకు నశించేరు. శరద్రాత్రులలో సరస్సులలో జలకమాడుతున్న ప్రాచ్య సుందరుల మోహించి, కొందరు తమ పని మరిచేరు. బైరాగుల మతం స్వీకరించి, సిద్ధిపొందడానికి కొందరు ఘోర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విధంగా, ఆ పీతాంబరం అనేక మానవుల జీవితంలో ప్రవేశించి, వారి విధి నిర్ణయించింది.

* * *

ముప్పదివసంతాలు గడిచేయి, పర్షియా రాయబారులు అరేలియన్ సముఖానికి బయలుదేరిన నాటినుండి. ఒకనాటి ప్రాతఃకాలాన ఆ యిరువురు బాటసారులు, ఒకరికొకరు తారసిల్లేరు, పాంచాల రాజ్యంలోని ఒక నదీతీరాన. దగ్గరలోనే కొండలు కనిపిస్తున్నాయి. చుట్టూ పచ్చికబయళ్లు. కొండల మీదినుంచి, ఉదయసూర్యుని లేతకిరణాలు పైకెగ ప్రాకుతున్నాయి. నదీతీరాన గడ్డిమీద మంచు బిందువులు ముత్యాలలా మెరుస్తున్నాయి. ఆ యిద్దరు పాంథుల్లోను ఒకనికి డబ్భయి సంవత్సరాలు, రెండవ అతనికి ఏభయి వుంటాయి. వారి దుస్తులన్నీ ధూళికొట్టుకుంటూ-చిరిగిపోయివున్నాయి. ఆ ముదుసలి కొంచెం చురుకుగానే నడుస్తున్నాడు. కాని, రెండవ బాటసారి, బహు ప్రయాసతో నడుస్తూ ప్రతి అడుగుకూ కుంటుతున్నాడు.

చురుకుగా నడుస్తూన్న ఆ ముదుసలి తూర్పు ముఖంగా ప్రయాణిస్తున్నాడు. కలుసుకున్నాక యిరువురూ అభివాదనాలు చేసికొన్నారు. రెండవ బాటసారియొక్క స్థితికి సానుభూతి తెల్పిన ముదుసలినిచూసి, యిట్లా అన్నాడు అతను.

'నన్ను సిలువవేసిన ఫలితం యిది' అని జోళ్లు విప్పి,అరికాళ్లు చూపించేడు. అప్పటికింకా క్రైస్తవ మతం వ్యాపించనూలేదు. శిలువ విధించబడ్డ వారంటే ప్రజలకు గౌరవమూ లేదు. ఆ ముదుసలి తన్నుగూర్చి దురభిప్రాయ పడతాడేమోనని, అతడు తన వాక్యాల్ని విస్తరించేడు.

'పీతాంబరం కోసం నేపడ్డ పాట్లలో యిది ఒకటి' అన్నాడు.

'పీతాంబరమా? సంపాదించగలిగేవా?' అన్నాడాముదుసలి బోటసారి బహు ఆత్రంతో. అతడే, మారోక్-బాద్.

'ఆఁ. సంపాదించేను. ఇక్కడికి తూర్పుగా ఏభయి యోజనాల దూరంలో ఒక లోయ వుంది. అక్కడ దొరికే ఒక పురుగునుండి, తయారుచేస్తారు ఆరంగు, పట్టువస్త్రాలకు వెయ్యడానికి. అనేక ప్రమాదాలకులోనై అక్కడికి చేరుకున్నాను.' అన్నాడు సోరియానస్.

'చేరుకున్నాక ఏం జరిగింది ?'

'నాకెదురుగా సిలువకు వ్రేలాడతీసిన ఒక అస్థిపంజరం కన్పించింది. ఆ రంగుకోసం అక్కడికి పోయేవారందర్నీ పట్టుకుని, కాళ్ళకు మాత్రమే మేకులుకొట్టి, సిలువవేస్తారు. చేతికందే దూరంలో చల్లని పానీయాలుంచుతారు. అవి తాగినట్లయితే, అతను చనిపోయేదాకా అల్లాగే వుంచుతారు. మూడురోజులుదాకా అవి తాగకుండా నిగ్రహించుకోగలిగితే, కట్లువిప్పి, రంగుయిచ్చి, పంపించేస్తారక్కడినుంచి. నేను నిగ్రహించుకున్నాను. రంగు సంపాదించేను. ఇదిగో, చూడు !'

అంటూ, పటకాతో నడుంకు బిగించుకున్న, గాజుసీసా పైకితీసి కళ్ళముందర ఆడించేడు. స్వచ్ఛమైన గాజుసీసాలో, కళ్లు మిరుమిట్లుగొలిపే, ద్రవ్యం మెరుస్తూంది. బంగారునీరులాంటి రంగులో వుంది. కాని, పట్టుకుండే మెత్తదనమూ, వజ్రానికుండే మెరుపూ కూడ కలిసేవున్నాయి.

మారోక్-బాద్ కళ్లు, ఆత్రంతో మెరిసేయి. సోరియానస్‌తో అన్నాడు:

'ఇటువంటి అద్భుతమైనద్రవ్యం ఎప్పుడూ చూడలేదు. పెద్దవాడి నయేను. సరిగా కనిపించడంలేదు. ఒకసారి చేతికిస్తావా? దగ్గిరగా చూసి, యీ కళ్ళను తరింపచేస్తాను' అన్నాడు ప్రార్థిస్తూన్నట్లు.

సరేనని సోరియానస్ ఆ సీసా చేతికిచ్చేడు. అది చేతికి దొరకడం తడువుగా, మారోక్-బాద్ పరుగు లంకించుకున్నాడు. అంతకుముందే అప్రమత్తుడై వున్న సోరియానస్, వెంట పరుగెత్తి యింకేమీ దొరక్కపోడంచేత, పండి గుండెలదాకా వ్రేలాడుతున్నగడ్డం దొరకపుచ్చుకున్నాడు. అప్పుడు జరిగిన యుద్ధంలో, మారోక్-బాద్ గడ్డం సగం తెగిపోయింది. వయోవృద్ధుడుకూడా ఏమో, యింక చేసేదిలేక, ఆ సీసాతో సోరియానస్ నెత్తిమీద బాదేడు, మారోక్-బాద్. సీసా పగిలిపోయి, ఆ అమూల్యద్రవం అంతా సోరియానస్ నెత్తిమీద వొలికిపోయి, ముఖంఅంతా పాకింది. అతని తెల్లటిజుట్టు, కనుబొమలు, మీసం, గడ్డం- అంతా అద్భుతమైన పీతాంబర వర్ణంలోకి మారిపోయింది. ఆరంగు వొదిలించుకోడానికి, ఆకుల రసం పులిమేడు, మట్టిరాసేడు, నీళ్లల్లో కడిగేడు. కాని ఆ రంగుమాత్రం పోలేదు. ఇంక దుఃఖంపట్టలేక, నేలమీదపడి చంటిపిల్లవాడిలా ఏడ్చేడు. ఆ అమూల్యద్రవం పోగొట్టుకున్నందుకు మారోక్-బాద్‌కూడా తనుచేసిన తెలివి తక్కువపనికి పశ్చాత్తాపపడి, ఇల్లా అన్నాడు:

'సోరియానస్! నేను చేసినపనికి నన్ను క్షమించు. నేనిప్పుడే బయలుదేరి, ఆ ద్రవం సంపాదించి నీకిస్తాను. నేను తిరిగి వచ్చేదాకా, యీ తమాల వృక్షంక్రింద నాకోసం వేచివుండు' అని సమాధానం కోసమైనా ఎదురు చూడకుండా, గమ్యస్థానానికి బయలుదేరేడు.

* * *

అక్కడవున్న చెట్లనుంచి పళ్లు కోసుకుతింటూ, సోరియానస్ కొంతకాలం, ఆతమాల వృక్షం దగ్గర నివసించేడు, మారోక్-బాద్ కొరకు ఎదురు చూస్తూ. చివరకు విసుగెత్తి, అక్కడనుంచి బయలుదేరి, కొన్నిరోజులు ప్రయాణంచేసి, నిర్జన ప్రదేశం దాటి, అయోధ్యారాజ్యంలో ప్రవేశించేడు. అతని వింత లక్షణాలు చూసి, గూఢచారులతన్ని నేరుగా రాజుదగ్గరకు తీసుకుపోయి హాజరు పెట్టేరు.

రాజే న్యాయాధికారి కనుక, యీ విచారణకు పూనుకున్నాడు రాజదర్బారులో.

"సామాన్య ప్రజలవద్ద వుండగూడని వస్తువు నీ దగ్గరుంది. అది నీనుంచి వెంటనే వేరుచెయ్యడానికి ప్రయత్నాలు జరుగుతే, యిప్పుడు పాపం! నీకు బాధకలుగుతుందనుకో! ఆ వస్తువు యే చెవ్వో, కాలో, అయివుంటే, యింతబాధలేక పోవును."

రాజుగారియొక్క దయార్ద్రహృదయాన్ని,సోరియానస్ గుర్తించక తప్పలేదు. కాని, ఆ తల తనది కనుక, అదివేరుచెయ్యడం ధర్మంకాదు కనక, దయచూపమని వేడుకున్నాడు.

"నీ తల నీ భుజాలమీదవుంది కనక నీదే. కాని, ఆ అద్భుతమైన పీతాంబరవర్ణం రారాజులదేకాని,

సామాన్య మానవులదికాదు. అందుచేత, ఆ రంగు కల్గిన ఆతలకూడా నాదే అవుతుంది. శారీరిక రీత్యా ఆతల నీదే. కాని న్యాయప్రకారం, ధర్మశాస్త్ర ప్రకారం అదినాకు చెందుతుంది. భౌతికవాదం, ఆధ్యాత్మికవాదం కంటె మిన్నా? న్యాయాన్ని వుల్లంఘిస్తావా? మూర్ఖులకు మాత్రమే అది నీతలే కదా, అనిపిస్తుంది. కాని ధర్మ సూక్ష్మాలెన్నే న్యాయాధీశుల కంటికి నీవొక అతి తెలివైన గజ దొంగవు' అన్నాడు రాజు.

'ఈ తగవు కంతకూ కారణమైన, యీ రంగు యాదృచ్ఛికంగా, అయాచితంగా వచ్చింది; కాని, యీ తల మాత్రం, చిన్నప్పటినుండీ నాదే ప్రభూ!'

'మళ్లీ మాట్లాడితే, నువ్వు దొంగవేకాదు; రాజద్రోహివికూడా. రాజ చిహ్నమైన యీ రంగు నీ శిరసుపై ధరించేవు కనుక.'

'అయితే, మహారాజులు, తమ శిక్షనంటి పెట్టుకున్న క్రూరత్వాన్ని ఆవలోకించేరా ?'

'అన్యాయంలేని శిక్షలో, క్రూరత్వంకూడా లేదు. క్రూరత్వం అంటూ ఏదైనావుంటే అది నీదే. ఎందుకంటే, నావస్తువు దొంగిలించడమే కాకుండా, నీకు నష్టం కలగకుండా అది నేను తిరిగి తీసుకొనే వీలులేకుండా చేసేవు కాబట్టి. ఈ విషయం నీకింకా సుబోధకం చేస్తానుండు. రాజ చిహ్నమైన యీ అమూల్య వస్తువును నువ్వు దొంగిలించేవు. అది నువ్వు వొప్పుకుంటావా? సరే న్యాయప్రకారం అది మళ్ళీ రాజకోశానికి చేర్చాలి. కాని నువ్వు చేసిన ఆఘాయిత్యపు పని ఏమిటి ? న్యాయాధికారిని మోసగించడానికి, నా వస్తువును నీ వస్తువు నించి వేరు పరచడానికి వీలులేకుండా చేసేవు. ఏ పాపం ఎరుగని నాలాటి అమాయకుడు, నీదౌష్ట్యం మూలాన ఆ వస్తువు పోగొట్టుకోవలసిందేనా ? అదే జరిగినట్లయితే, ధర్మం అఘోరిస్తుంది. న్యాయం ఏడుస్తుంది. దేవతలు పెడ బొబ్బలు పెడతారు. అబ్బే, లాభంలేదు, నీ తల తెగ్గొయ్యవలసిందే. సరే అదలావుంచు. నీకు, అత్తరువులు, అరుదైన ఫల హారాలు, యిత్యాది భోగ్యవస్తువులు తయారు చెయ్యడంలో ఏమైనా నేర్పువుందా ?' అన్నాడు అయోధ్య రాజు, తన విచిత్ర తర్కానికి తనే సంతోషిస్తూ.

'నేనంత నీచపు పనులకు పాల్పడలేదు ప్రభూ! నేను రోమను చక్రవర్తి ఆస్థాన వేదాంతుల్లో తల మానికాన్ని !' అన్నాడు సోరినూనస్.

'వేదాంతి నంటావు. మళ్ళీ యీ రాజభోగ్యానికి యిన్ని పాట్లుపడ్డావు. వేదాంతంలో కంటె, నీ బుర్రకు, వేరు చేస్తేనే విలువెక్కువ.'

'నాకు సరియైన జ్ఞానం ప్రసాదించేరు ప్రభూ! నా తలకోసం యిక విచారించను. పైకి, యీ రంగుతో అసహ్యంగావుంది నాకు. రాజ సేవలో నా జీవితం తెలివి తేటలూ, వ్యర్థం చెయ్యకుండా వారించని. యీ మెదడుకూడా నాకు గర్హ్యమే. రాజుల నాశ్రయించుకు బ్రతికే ధీశాలురకు వినాశనమే రాసిపెట్టివుంది. నేనుచెప్తున్నాను, వస్తుందొక రోజు - రారాజులు ధీశాలుర, వేదాంతుల కనుసన్నలలో మెలుగుతూ స్వాతంత్ర్యం, శాంతి, అభ్యుదయాలకై ...'

ఇష్టంలేని సంభాషణలను సగంలోనే త్రుంచే అభ్యాసం అయోధ్యరాజుకువుంది. రాజుకనుసన్న చూసి అంగరక్షకుడొకడు విచ్చుకత్తితో, సోరియూనస్ శిరస్సు, కొబ్బరి పుచ్చెలా ఎగరకొట్టేడు. అతనివాక్యం సగంలోనే ఆగిపోయింది. కిందదొర్లుతున్న తలయొక్క పెదవులింకా కదులుతూనే వున్నాయి. బహుశా, ప్రాణంలేందే. ఆ రంగు నిలవదు కాబోలు; కొద్దిక్షణాలలో, పీతాంబరవర్ణం పోయి మట్టిరంగు వచ్చేసింది- ఆతలకంతకూ, జుట్టు, గడ్డం, కనుబొమలుతో సహా, రాజుకూడా, అసహ్యించుకుని, దేహంతోబాటే, దాన్నికూడా తగుల బెట్టించేడు.

సరిగా అదేసమయానికి, మార్కొబాద్ శవానికోసం, నక్కలూ, రాబందులూ కాట్లాడుకుంటున్నాయి, ఒక అరణ్య ప్రదేశంలో.

కాని చాలాకాలంవరకూ, రోమనుచక్రవర్తులూ పర్షియన్ మహారాజులూ ఆ పీతాంబరం కోసం నిట్టూరుస్తూనే వున్నారు.

[రిచర్డ్ గార్నెట్ ఇంగ్లీషు కథకు అనుసరణ.]